# ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటుకు కట్టుదిట్టమైన చర్యలు..

వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్




2లో




# ప్రజాజ్యోతి

## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 31 | మార్చి | 2024 | పేజీలు: 5


- అడవి చాటున సాగే వ్యాపారానికి అనుమతులు ఉన్నాయా.?
- ఇటుక బట్టీల్లో మగ్గుతున్న చిన్నారుల బాల్యం.!
- తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్న అధికారులు..
- మామూళ్లతో మత్తుగా.. వ్యాపారాలకు వత్తాసుగా..
- అంతా ఒక్కటై దుర్మార్గానికి తెరలేపారా.?
- ఉన్నతాధికార యంత్రాంగం దృష్టి సారించాలి..



## అక్రమాలకు అంతే లేదు..

2 లో

# అవినీతికి కొదవే లేదు..



మామూళ్ల మత్తులో అక్రమా వ్యాపారాలకు వత్తాసుగా అధికారులు వ్యవహరిస్తున్న పరిస్థితుల్లో అడ్డదారి వ్యవహారాలకు అడ్డు అదుపు ఉండదననే విషయం అశ్వాపురం మండలంలో సాగుతున్న ఇటుక వ్యాపారాలను చూస్తే అర్థమవుతుంది. ఈ మండలంలో తుమ్మలచెరువు, సీతారాంపురం, బిజీ కొత్తూరు తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో నిర్వహిస్తున్న ఇటుక బట్టీల వెనుక కొందరు అవినీతి అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని ఆరోపణలు వస్తున్న మామూలు తిన్న పాపానికి వారు నైతికతను వీడి నిసిగ్గుగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో ఏడాదికి 100 కోట్లకు పైగా ఇటుక వ్యాపార లావాదేవీలు సాగుతాయని లెక్కలు ఉన్న నేపథ్యంలో ఇంత పెద్ద స్థాయి వ్యాపారం ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సాగుతుందనే ఆరోపణలు ఉన్న అవినీతి ప్రబుద్ధులు తేలు కుట్టిన దొంగల్లానే మౌనంగా ఉండాల్సి వస్తుంది. ఇటుక వ్యాపారం నుండి భారీగా ముడుపులు తీసుకున్న ప్రభుత్వ శాఖలు కొన్ని వారికి దాసోహం అవ్వాల్సి వస్తుంది. దీంతో అక్కడ ఎలాంటి దుర్మార్గపు పనులు సాగిన అడిగే వారే కరువయ్యారు.

■ భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి / అశ్వాపురం, ప్రజాజ్యోతి

## సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన మొబైల్స్

ఫోన్లను బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్..

కానిస్టేబుల్‌ను ప్రశంసించిన జిల్లా ఎస్పీ



5లో

## ముగిసిన పది పరీక్షలు

ఉద్వేగ భరితంగా విద్యార్థుల వీడ్కోలు

అశ్వారావుపేట,మే28, ప్రజాజ్యోతి:

ప్రశాంత వాతావరణం మధ్య పదో తరగతి పరీక్షలు ముగిశాయి. ఉపాధ్యాయుల సలహాలు సూచనలతో ప్రశాంతంగా పరీక్షలు రాసినట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. పరీక్షలు ముగిసిన అనంతరం తమ తమ పాఠశాలకు చేరుకున్న విద్యార్థులు తమను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులతో కలిసి ఫోటోలు దిగారు. పాఠశాల విద్యా ముగిసిపోతున్నందుకు ఒకరి నొకరు ఉద్వేగభరితంగా ఆత్మీయంగా అలింగనాలు చేసుకుంటూ వీడ్కోలు పలికారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అక్రమాలకు అంతే లేదు.. అవినీతికి కొదవే లేదు...

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి/ అశ్వాపురం, ప్రజాజ్యోతి

మామూళ్ల మత్తులో అక్రమా వ్యాపారాలకు వత్తాసుగా అధికారులు వ్యవహరిస్తున్న పరిస్థితుల్లో అడ్డదారి వ్యవహారాలకు అడ్డు అదుపు ఉండదననే విషయం అశ్వాపురం మండలంలో సాగుతున్న ఇటుక వ్యాపారాలను చూస్తే అర్థమవుతుంది. ఈ మండలంలో తుమ్మలచెరువు, సీతారాంపురం, బిజీ కొత్తూరు తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో నిర్వహిస్తున్న ఇటుక బట్టీల వెనుక కొందరు అవినీతి అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని ఆరోపణలు వస్తున్న మామూలు తిన్న పాపానికి వారు నైతికతను వీడి నిసిగ్గుగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో ఏడాదికి 100 కోట్లకు పైగా ఇటుక వ్యాపార లావాదేవీలు సాగుతాయని లెక్కలు ఉన్న నేపథ్యంలో ఇంత పెద్ద స్థాయి వ్యాపారం ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సాగుతుందనే ఆరోపణలు ఉన్న అవినీతి ప్రబుద్ధులు తేలు కుట్టిన దొంగల్లానే మౌనంగా ఉండాల్సి వస్తుంది. ఇటుక వ్యాపారం నుండి భారీగా ముదుపులు తీసుకున్న ప్రభుత్వ శాఖలు కొన్ని వారికి దాసోహం అవ్వాల్సి వస్తుంది. దీంతో అక్కడ ఎలాంటి దుర్మార్గపు పనులు సాగిన అడిగే వారే కరువయ్యారు. ఈ బట్టీల్లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను తీసుకొచ్చే వారితో వెట్టిచాకిరి చేయించుకోవడమే కాక వారి పిల్లల భవితవ్యాన్ని నాశనం చేస్తున్న పరిస్థితులు నెలకొన్న అడిగే సాహసం అధికారులు లేకుండా పోయింది. తమ పిల్లలను కాన్వెంట్ చదువులకు పంపిస్తూ ఇటుక వ్యాపారాల దుర్మార్గానికి పేద కార్మికుల పిల్లలను బలి పశువులు చేస్తున్న వారిని కూడా వెట్టిచాకిరికే పరిమితం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఉందనే ఆరోపణలు ఉన్నాయి. విద్యకు దూరంగా చిరుప్రాయంలోనే తల్లిదండ్రులతో పాటు బట్టీల్లో మగ్గాల్సిన చిన్నారుల దుస్థితికి మామూళ్ల మత్తులో ఉన్న అధికార యంత్రాంగమే కారణమనేది జగమెరిగిన సత్యం. ఏజెన్సీ ప్రాంతంలో ఎకరాలకొద్దీ ఏరియాలో ఇటుక బట్టీలు నిర్వహిస్తూ ఇతర ప్రాంతాల నుండి కూలీలను తీసుకువచ్చి కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్న వారిపై అధికారుల పరిశీలన, నిఘా లేకపోవడం దుర్మార్గమే అవుతుంది. ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులు జిల్లాలో ఉన్నప్పటికీ వారు కూడా ఇలాంటి వ్యవహారాలను పట్టించుకోకపోతే పాలన వ్యవస్థ పైనే మచ్చపడే అవకాశాలు లేకపోలేదు. అశ్వాపురం కేంద్రంగా సాగే కోట్లాది ఇటుక వ్యాపారం ఏ రకమైన అనుమతులు నడుమ నడుస్తుందో ఉన్నతాధికారులు ఆరా తీయాల్సిన అవసరం ఉంది. అక్కడ బట్టీల్లో చిన్నారుల బాల్యం బలైపోతున్న దుస్థితి ఉన్నప్పటికీ ఇంకా మౌనంగానే ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. బట్టీలు నిర్వహిస్తున్న స్థలం ఎవరిది.? అటవీ ప్రాంతంలో ఈ బట్టీలను పెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటి.? బట్టీల నిర్వహణకు ఉపయోగించే కలప, బొగ్గు ఎక్కడి నుండి వస్తుంది.? కోట్లు విలువ చేసే ఇటిక వ్యాపారం చేసేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా.? అనే విషయాలపై విచారించాల్సిన బాధ్యత విస్మరించి క్రింది స్థాయి యంత్రాంగం మామూళ్ల మత్తులో ఉందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉన్నత స్థాయి అధికారులు కూడా ఉదాసీనంగా ఉండడం సరికాదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బట్టీల్లో చదువుకు దూరంగా ఉన్న చిన్నారులను పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత విస్మరిస్తున్న సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





# ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, మార్చి 30, ప్రజాజ్యోతి:

పార్లమెంట్ ఎన్నికలలో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యంపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఐడిఓసి నుంచి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా , అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మరియు ఐ టీ డి ఏ పి ఓ ప్రతీక్ జైన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే సదరు ఉద్యోగులందరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందించే దిశగా అవసరమైన మేర అదనపు ఫారం 12 లు సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించే సమయంలో అవసరమైన మేర కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఫారం 12 లు అందజేసి ఉద్యోగి ఆప్షన్ తీసుకోవాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది సమర్పించిన ఆప్షన్ ల ప్రకారం ఏ ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద తమ ఓటు హక్కు వినియోగించుకోవాలో అనే అంశం ఎస్ఎంఎస్ ద్వారా పంపడం జరుగుతుందని, ఓటు హక్కు వినియోగించు కోవడం కోసం ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి జిల్లాలో ఉద్యోగుల నుంచి ఫారం 12 తీసుకొని ఆన్ లైన్ లో నమోదు చేసేందుకు ఒక ప్రత్యేక అధికారిని కేటాయించాలని, ఆన్ లైన్ లో నమోదు చేసిన ఫారం 12లు సంబంధిత పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్దకు వెళ్తాయని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం హెడ్ క్వార్టర్ లో మే 3న, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మే 4 నుంచి మే 8 వం-కు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు స్వీకరించాలని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి ఫారం 12 సమర్పించి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది తమ ఓటు హక్కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా పొందవచ్చని తెలిపారు. భారత ఎన్నికల కమీషన్ అత్యవసర సేవలలో పాల్గొనే సిబ్బందికి సైతం ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందని అన్నారు. అత్యవసర సేవలలో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం రిటర్నింగ్ అధికారికి ఏప్రిల్ 23 లోపు ఫారం 12డి సమర్పించాలని, సదరు దరఖాస్తులను పరిశీలించి రిటర్నింగ్ అధికారి ఏప్రిల్ 24 నాడు ఆమోదించిన దరఖాస్తులకు ఎస్ఎంఎస్ ద్వారా ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంపై సమాచారం అందిస్తారని, మే 3 నుంచి మే 8 వరకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద వారి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు. 85 సంవత్సరాల పైబడిన సీనియర్ సిటిజెన్లకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమీషన్ ప్రవేశపెట్టిందని, ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించు కోవాలనుకునేవారు ఏప్రిల్ 23లోపు ఫారం 12 డి సమర్పించాలని అన్నారు. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అర్హులను ఏప్రిల్ 25 నాటికి ఎంపిక చేస్తారని, ఏ.ఆర్.ఓ లు షెడ్యూల్ రూపొందించి బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటికి వచ్చే షెడ్యూల్ సమాచారం ఓటర్లకు అందించడం జరుగుతుందని అన్నారు. మే 3 నుంచి మే 6 వరకు మొదటి దశ , మే 8న రెండవ దశ ఇంటి వద్ద పోలింగ్ పూర్తి చేయడం జరుగుతుందని, ఇంటి వద్ద పోలింగ్ కు వెళ్లే సమయంలో పోలింగ్ సిబ్బంది వీడియో గ్రాఫర్ తప్పనిసరిగా వెళ్తారని, రాజకీయ పార్టీలకు సైతం సమాచారం అందించడం జరుగుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ మే 1 ఒకటి 2 మరియు 3 తేదీలలో జరుగు ప్రెసెండింగ్ అధికారులు మరియు సహాయ ప్రెసెండింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయవలసిందిగా ఏ ఆర్ ఓ లను ఆదేశించారు. శిక్షణకు హాజరు అయ్యే ప్రెసెండింగ్ అధికారులు , సహాయ ప్రసంగం అధికారులు తప్పనిసరిగా ఎపిక్ కార్డులను తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో ప్రతి శిక్షణ కేంద్రానికిఇన్చార్జిగా జిల్లా అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రతి అధికారి వారికి కేటాయించిన కేంద్రాలను తనిఖీ చేసిఅన్ని ఏర్పాట్లును పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధి నిర్వహణ కారణంగా పోలింగ్ రోజు ఓటు వేసే అవకాశం లేని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్స్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ నిర్వర్తించేందుకు జిల్లాలో వినియోగించే ప్రతి సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 85 ఏళ్ళ వయస్సు గల వారు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకుంటే వారి ఇంటి వద్దకు పోలింగ్ అధికారులు వచ్చి ఓటు వేసే అవకాశం కల్పిస్తారని ఏ తేదీ ఏ సమయంలో వచ్చేది ముందుగానే సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. పోస్టల్ బ్యాలెట్లు, ఇంటి వద్ద ఓటింగ్ పొందడానికి ఫారం 12 డీ లను రిటర్నింగ్ అధికారికి ఏప్రిల్ 23 లోపు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికలలో విధులు నిర్వహించే ఉద్యోగికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించే విధంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏ ఆర్ ఓ లు, ఎలక్షన్ సూపరెంటెండ్లు ధారా ప్రసాద్, రంగ ప్రసాద్ మరియు తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# అనాథ శరణాలయాన్ని సజావుగా నడపండి

**- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి**

*కొత్తగూడెం క్రైమ్, మార్చి 30, ప్రజాజ్యోతి*





కొత్తగూడెం బూడిదగడ్డలో గల శ్రీ స్నేహలత సంధ్యలత పిల్లల ఆశ్రమాన్ని శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సందర్శించారు. న్యాయమూర్తి పిల్లలకు అందిస్తున్న కనీస సౌకర్యాల గురించి ఆశ్రమ నిర్వాహకుడు కొమరయ్య ను అడిగి తెలుసు కున్నారు. వివిధ కారణాల వలన తల్లిదండ్రులను కోల్పోయి పిల్లల సంరక్షణ కష్టంగ ఉండడం వలన వచ్చిన పిల్లలకు సంరక్షణ, విద్య, ఆహారం తదితర అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా తెలిపారు. న్యాయమూర్తి అనాథ శరణాలయం ఆవరణ, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. అనాథ శరణాలయంను సజావు గా నిర్వహించాలని అన్నారు. అనంతరం పిల్లలకు అరటి పండ్లు, బిస్కెట్లను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తం రావు, డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, అసిస్టెంట్ కౌన్సిల్ జ్యోతి విశ్వకర్మ, నాగ ప్రవంతి, న్యాయవాది మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎల్ బి టి టైల్స్ అండ్ సానిటరీవేర్ ను ప్రారంభించిన కొత్వాల

*పాల్వంచ, మార్చి 30, ప్రజాజ్యోతి:*



పాల్వంచ మండల పరిధిలోని పెద్దమ్మగుడి జగన్నాధపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన టైల్స్ అండ్ సానిటరీవేర్ ను డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. శనివారం జగన్నాధపురంలో ఏర్పాటు చేసిన ఎస్ ఎల్ బి టి టైల్స్ అండ్ సానిటరీవేర్ అధినేతలు బివిఎస్ఎస్ మణికంఠ, బి చంద్రశేఖర్ ల ఆధ్వర్యంలో వ్యాపార సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. వ్యాపారాలు సరసమైన ధరలకు నాణ్యమైన మెటీరియల్ ను అందించి కస్టమర్ల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎల్ బి టి టైల్స్ అండ్ సానిటరీవేర్ యజమానులు బి వి ఎస్ ఎస్ మణికంఠ, బి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు జాలే జానకిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ నాయకులు కోండం వెంకన్న, శివారెడ్డి, బద్ది కిషోర్, బాలినేని నాగేశ్వరరావు, కోండం పుల్లయ్య, బెల్లంకొండ రామారావు, మాజీ సర్పంచ్ అనిత, నందా నాయక్, బాదర్ల జోషి, దారా చిరంజీవి, ఉండేటి శాంతివర్ధన్, గంధం నర్సింహారావు, కామాచారి, నరేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

**- డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల**





*పాల్వంచ, మార్చి 30, ప్రజాజ్యోతి:*

వేసవి దృష్ట్యా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచలో శనివారం వీరభద్ర వాటర్ సర్వీసింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కొత్వాల ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. తీవ్ర ఎండల దృష్ట్యా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా అయ్యేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో వద్దిపర్తి వీరరాఘవాచారి, గంధమల్ల రాజయ్య, గుమ్మడివల్లి నర్సింహారావు, తిరుమల రమేష్, కూర చంద్రం, నల్లమల్ల వేణు, బండారు సత్యనారాయణ, మోత్కురు రవి, వజ్జల రాము, డాక్టర్ మస్తాన్, దారా చిరంజీవి, చారుగుండ్ల వెంకటేశ్వర్లు, రఘునాథ రాజు తదితరులు పాల్గొన్నారు.


# జనరిక్ మందుల పై అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలి: గద్దల రమేష్

*పాల్వంచ, మార్చి 30, ప్రజాజ్యోతి:*



అతి తక్కువ ధరలకు లభించే జనరిక్ మందుల పైనా అవగాహన లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పాల్వంచ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గద్దల రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రం దేశవ్యాప్తంగా జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించిందన్నారు. కానీ గత ప్రభుత్వం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో జరిగిన పరిణామాలకు తగిన మూల్యం చెల్లించుకోవలసి వచ్చిందని అన్నారు. ఈ ప్రజా ప్రభుత్వంలో ఉన్నత అధికారులు గ్రామాలలో విస్తృతంగా జనరిక్ మందులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అధికారులు తక్షణమే అవగాహన కార్యక్రమాలు చేపడితే పేద, మధ్య తరగతి ప్రజలు మందులపై పడుతున్న ఖర్చులు తగ్గుతాయన్నారు. తక్కువ ధరలకు అందుబాటులో ఉండే జనరిక్ మందులు కొనుగోలు చేయడం వలన ప్రజలకి ఎంతో లాభం చేకూరుతుందన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రజలకు జనరిక్ మందులంటే తెలియని స్థితిలో ఉన్నారని, వాటిపై తగు రీతిలో ఆర్థిక భారం తగ్గించే జనరిక్ మందులపై జిల్లా అధికారులు అన్ని మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఆశ, అంగన్వాడి వర్కర్స్ ద్వారా జనరిక్ మందుల గురించి గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ప్రతి మండలానికి 10 నుంచి 15 మందుల షాపులు ఏర్పాటు చేసే విధంగా అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికి జనరిక్ మందులపై అవగాహన తెలిసినప్పుడే పేద మధ్యతరగతి కుటుంబాలు బాగుపడతాయని అన్నారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో లేబర్ ఆఫీసర్‌కి దరఖాస్తులు అందజేత



*మణుగూరు రూరల్, మార్చి 30, ప్రజాజ్యోతి:*

మణుగూరులో హాస్పిటల్స్, బంకులు షాపులో పనిచేసే కార్మికులు. టీచింగ్ నాన్ టీచింగ్ పలు సమస్యల పై, కార్మిక వ్యతిరేక జీవోల రద్దు పై సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో లేబర్ ఆఫీసర్ కి దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్ మాట్లాడుతూ. న్యాయమైన వేతనాల కోసం పోరాడుదాం అని. 2014 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో నుండి ఉద్యోగ కార్మిక వర్గానికి రెండుసార్లు వేతనాలు పెంచింది. 20 20 పిఆర్సి రిపోర్టు లో కనీసం 19000 అత్యధికంగా. అత్యధికంగా 1,67,70 ఉండాలని చెప్పింది దీన్ని ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలు వేతనాలు పెంచింది. ఇదే ప్రభుత్వం పారిశ్రామిక యాజమాన్యాలు చెల్లించే వేతనాలు నిర్ణయించే సందర్భంలో పక్షపాతం ప్రదర్శిస్తున్నది. కార్మికుల శ్రమ చేస్తేనే ఉత్పత్తి జరుగుతుంది. ఉత్పత్తి అయిన సరుకులు పెట్టుబడిదారులు మార్కెట్లో చేసుకుని కొట్లాది రూపాయలు లాభాలు అర్జిస్తున్నారు. కార్మికుల శ్రమ లేనిదే ఉత్పత్తి లేదు పెట్టుబడిదానికి లాభాలు కార్మికుల వేతనాలు తగ్గించడానికి ప్రభుత్వం నిర్ణయం చేయాలి మార్చి 10 నుండి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున క్యాంపైన్లు చేయాలని క్యాంపులో భాగంగా మణుగూరు లేబర్ ఆఫీసర్ కి దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

# సెంట్రల్ సిలబస్‌కు సిద్ధమైన యాజమాన్యం



*ఇల్లందు, మార్చి 30, ప్రజాజ్యోతి:*

సింగరేణి పాఠశాలల్లో సెంట్రల్ సిలబస్ కు యాజమాన్యం సిద్ధం కావడం హర్షణీయమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి యండి నజీర్ అహ్మద్ లు పేర్కొన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి ఎన్నికల సమయంలో ఏఐటియుసిని గుర్తింపు సంఘంగా గెలిపిస్తే సింగరేణి సంస్థ నడుపుతున్న పాఠశాలల్లో సీబీఎస్ఈ అనగా సెంట్రల్ సిలబస్ అమలు చేయించడం ద్వారా కార్మికుల పిల్లలకి మెరుగైన విద్య సదుపాయం అందింప చేస్తామని తెలపడం జరిగిందన్నారు. కార్మికుల పిల్లల చదువులకు వెచ్చిస్తున్న రూ. లక్షల ఖర్చును తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. ఏఐటీయూసీ నేతలు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్ కుమార్ లు యాజమాన్యంతో ఈ విషయంపై చర్చించారన్నారు. ఏఐటీయూసీ ఫలితంగానే సింగరేణిలోని అన్ని పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యా విధానాన్ని అమలు చేయడానికి యాజమాన్యం నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై యాజమాన్యం కార్మికుల వద్ద నుండి స్టేట్ సిలబస్, సెంట్రల్ సిలబస్ పై అభిప్రాయ సేకరణకు సర్క్యులర్ జారీ చేసిందని పేర్కొన్నారు. కార్మికులు తమ అభిప్రాయాన్ని కార్మికుల కుటుంబాలు, పిల్లలకు ఎంతో ఉపయోగకరమైన సెంట్రల్ సిలబస్ (సీబీఎస్ఈ) విధానాన్ని అమలు చేయాలని తమ అభిప్రాయాన్ని చెప్పాల్సిందిగా ఏఐటియుసి కార్మికులకు విజ్ఞప్తి చేయడం జరుగుతుందని తెలిపారు.

# కేటీపీఎస్‌లో కారుణ్య నియామకాల దరఖాస్తులను పునరుద్ధరించండి





**పాల్వంచ, మార్చి 30, ప్రజాజ్యోతి:** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ( హెచ్-142) నాయకులు శనివారం కేటీపీఎస్ 5,6,7వ దశల చీఫ్ ఇంజనీర్స్ మేక ప్రభాకర్ రావు, పాలకుర్తి వెంకటేశ్వరరావు లను యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి రామా రావు కలిసి కేటీపీఎస్ కాంప్లెక్స్ లలో 2022 నుండి మరణించిన కార్మికులు, ఉద్యోగులు, ఆర్టిజన్స్ కుటుంబాలు కారుణ్య నియామకాల కోసం దరఖాస్తులను అప్పటి జెన్కో యజమాన్యం జి.ఓ. 6ను వర్తింప చేస్తూ, వివిధ కారణాలను సాకుగా చూపించి వాటిని నిరాకరిస్తున్నట్లు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జన్కో స్టేషన్స్ హెడ్స్ కు ఉత్తర్వులను ఇచ్చారని, అనేకసార్లు అప్పటి విద్యుత్ యాజమాన్యం కు జి. ఓ. 6 ను రద్దు చేస్తూ రెండవసారి కారుణ్య నియామకాలను చేపట్టాలని విన్నవించినా ఫలితం లేకపోయిందని తర్వాత క్రమంలో ఇటీవల నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలోని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క మల్లు ను కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాదులోని ప్రజా భవన్ లో కలిసి జన్కోలోని కార్మిక కుటుంబాలు కారుణ్య నియామకాల కోసం కొన్ని సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్నారని తెలుపుతూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తమ యూనియన్ ద్వారా ఇచ్చామని, విద్యుత్ సంస్థల్లో మిగతా కంపెనీల మాదిరిగానే జన్కోలో కూడా కారుణ్య నియామకాలను ఒకే విధంగా ఉండేలా చూస్తూ రెండవసారి కూడా ఇచ్చేలా జెన్కో యాజమాన్యం కు ఆదేశాలు ఇవ్వాలని కోరామని తెలిపారు. అదే క్రమంలో ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో జి. ఓ. 6 ను రద్దు చేస్తూ 20-03-24 న జన్కో యాజమాన్యం ఒక సర్క్యులర్ ను విడుదల చేస్తూ తిరిగి 2020 సంవత్సరం నుండి కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని, గతంలో నిరాకరించిన వాటిని తిరిగి పునరుద్ధరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జెన్కో స్టేషన్ హెడ్స్ కు ఆదేశాలను ఇచ్చారని, అదే క్రమంలో కేటీపీఎస్ కాంప్లెక్స్ లలో కారుణ్య నియామకాల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వాటిని మరొకసారి కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తూ తిరిగి జెన్కో యాజమాన్యం కు పంపించే విధంగా సహకరించాలని యూనియన్ నాయకులు కోరగా.. జెన్కో యాజమాన్యం ఆదేశాల మేరకు గతంలో నిరాకరిం చిన, పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాల దరఖాస్తులను హైదరాబాదులో ఉన్న విద్యుత్ ఉన్నతాధికారులకు పంపిస్తామని కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్స్ హామీ ఇచ్చినట్లు రామారావు తెలిపారు. అలాగే కేటీపీఎస్ ఏడవ దశలో పనిచేస్తున్న ఆర్టిజన్స్ అందరికీ యూనిఫాం ( డ్రెస్ క్లాత్), సేఫ్టీ పరికరాలను ఇప్పించే విధంగా చూడాలని కోరగా త్వరలోనే డ్రెస్ క్లాత్ ఇస్తామని చీఫ్ ఇంజనీర్ పాలకుర్తి వెంకటేశ్వర రావు హామీ ఇచ్చారని రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ శ్రీనివాస చారి, డి సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటే శ్వర్లు, షేక్ సయ్యద్, ఎర్రగడ్డ ప్రసాద్, ఎం శివరాం, కే శ్రీనివాస్, బి బాలు, కే వేణు తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో గౌరవప్రదంగా జీవించాలి

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి**





**కొత్తగూడెం క్రైమ్, మార్చి 30, ప్రజాజ్యోతి**

సమాజంలో ట్రాన్స్ జెండర్స్, సెక్స్ వర్కర్స్ గౌరవప్రదంగ జీవించాలని వారి హక్కులు, సంరక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని వివిధ పరిస్థితిల కారణంగ సెక్స్ వర్కర్ గా మారిన మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగ ఉండాలని తెలిపారు. వారి పట్ల ఎవరు వివక్ష చూపరాదని అన్నారు. ఈ సందర్భంగ ట్రాన్స్ జెండర్, సెక్స్ వర్కర్స్ కు ఉన్న సమస్యలను న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం తదనంతరం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న ట్రాంజెండర్స్, సెక్స్ వర్కర్స్ కు ఉచిత బియ్యం ను శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి సమక్షంలో పంపిణీ చేశారు. పంపిణీ అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతినెల ట్రాన్స్ జెండర్, సెక్స్ వర్కర్స్ కు ఉచిత బియ్యాన్ని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతినెల పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని సెక్యూర్ ఎన్జీవో ప్రాజెక్ట్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. పురుషోత్తం రావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. నిరంజన్ రావు, అసిస్టెంట్ కౌన్సిల్స్ జ్యోతి విశ్వకర్మ, నాగ స్రవంతి, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు, సెక్యూరిఎన్జీవో రాజేంద్రప్రసాద్, సఖి అడ్మిన్ సుభశ్రీ, పి ఎల్ వి రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# కేఓసీలో పర్యటించిన డైరెక్టర్




**టేకులపల్లి, మార్చి 30, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని కోయగూడెం ఉపరితలగనిలో శనివారం సింగరేణి సంస్థ డైరెక్టర్(ఇ అండ్ యం) డి. సత్యనారాయణ రావు పర్యటించారు. ఓసి పని స్థలాలు, బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.శ్రీనివాస్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోని, యంత్రాల పనిగంటలు పెంచడం వల్ల రవాణా లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఉత్పత్తి, రవాణాకు ఎలాంటి ఆటంకం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఉపరితల గనుల్లో ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని తీయాలని, సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఓ వి. శ్రీనివాస్, యస్ఓటూ డైరెక్టర్ (ఇ అండ్ యం ) కే.వి. రావు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, గని మేనేజర్ సౌరబ్ సుమన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ శివశంకర్, సేఫ్టీ ఆఫీసర్ రాజు, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



**పాల్వంచ, మార్చి 30, ప్రజాజ్యోతి:**

పాల్వంచ పట్టణ పరిధిలోని సంజయ్ నగర్ లో వున్న శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారి జన్మస్థలంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం దేవాలయంలో పూజారులు పద్మనాభ శాస్త్రి, మురళి, పవన్ అయ్యగార్ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్వంచ ప్రముఖ కాంట్రాక్టర్ జక్కుల వెంకటేశ్వర్లు, జక్కుల ప్రసాద్ ల నేతృత్వంలో విగ్రహ దాతగా, విగ్రహ ప్రతిష్టను జరిపించారు. విగ్రహ ప్రతిష్ట ప్రత్యేక పూజల్లో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి విమలాదేవి దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం నిర్వాహకులు కంచర్ల బాలకృష్ణ, చల్లా లక్ష్మీనారాయణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఓ టూ జీఎంను సన్మానించిన ఐఎన్టీయుసి నాయకులు



**మణుగూరు రూరల్, మార్చి 30, ప్రజాజ్యోతి**

మణుగూరు ఏరియాకు ఇటీవల బదిలీ అయి ఎస్ఓ టూ జీఎంగా బాధ్యతలు స్వీకరించిన శ్యాంసుందర్ ను ఆయన చాంబర్ లో ఐఎన్టీయూసీ నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, బ్రాంచి సెక్రటరీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు నాయకులు మాట్లాడుతూ గతంలో పలు విభాగాల్లో మణుగూరు ఏరియాలో పనిచేసి గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి మళ్లీ మణుగూరుకు కొత్తగూడెం కార్పొరేట్ నుంచి బదిలీ అయ్యి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉత్పత్తి ఉత్పాదకలతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘంగా మా వంతు సాయం అందిస్తామని ఐఎన్టీయూసీ నాయకులు ఈ సందర్భంగా అన్నారు. ఏరియా లోని ప్రధాన సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గట్టయ్య, షాబుద్దీన్, రాములు, జయరాజు, బుర్రా వెంకటేశ్వర్లు, మస్తాన్, నాయుడు, ఎం.శ్రీను ఉన్నారు.

# లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా మిరియాల



**ఇల్లందు, మార్చి 30, ప్రజాజ్యోతి:** హైదరాబాద్ జిల్లా 320 హెచ్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ చైర్మన్ గా ఇల్లందుకు చెందిన మున్నూరుకాపు సంఘ రాష్ట్ర నాయకులు, లయన్ మిరియాల చంద్రమోహన్ ను లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ ఎన్. మనోహర్ రెడ్డి నియమించారు. లయన్ మిరియాల చంద్రమోహన్ గతంలో లయన్స్ క్లబ్ బెస్ట్ ప్రెసిడెంట్, జిల్లా బెస్ట్ జోన్ చైర్ పర్సన్ గా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని నియమాక ఉత్తర్వులలో పేర్కొన్నారు. మిరియాల చంద్రమోహన్ సేవా కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని రీజియన్ చైర్ పర్సన్ గా నియమించడం జరిగిందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ ఎన్. మనోహర్ రెడ్డి తెలిపారు.

# సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన మొబైల్స్

## ఫోన్లను బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్.. కానిస్టేబుల్‌ను ప్రశంసించిన జిల్లా ఎస్పీ

**కొత్తగూడెం క్రైమ్ మార్చి 30, ప్రజాజ్యోతి:**

జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మొబైల్ ఫోన్లను పోగొట్టు కున్న భాదితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి తిరిగి వారికి అందజేయడం జరుగుతుం దని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలియ జేసారు. ఈ ఏడాది జనవరి నుండి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సి ఇ ఐ ఆర్ పోర్టల్ ద్వారా మొత్తం 1674



ఫిర్యాదులను అందుకోవడం జరిగింది. ఇందులో 964 మొబైల్స్ ను కనిపెట్టడం జరిగిందని తెలిపారు. కనిపెట్టిన వాటిలో ఇప్పటివరకు 483 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగిం చడం జరిగిందని అన్నారు. మొబైల్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీసి జి పోర్టల్ లో ఆన్లైన్ ద్వారా అడిగిన అన్ని రకాల వివరా లను కచ్చితంగా నమోదు చేసుకుంటే సంబంధిత పోలీస్ స్టేషన్ నుండి తిరిగి వారి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి కనిపెట్టడం జరుగుతుందని తెలియ జేశారు. కావున ఎవరైనా తమ మొబైల్ దొంగిలించబడిన పోగొట్టు కున్న వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా తిరిగి వారి మొబైల్ ఫోన్ లను పొందవచ్చునని తెలిపారు. జిల్లాలో కొత్తగూడెం త్రీ టౌన్ మరియు మణుగూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా ఈ వదమైన మొబైల్ ఫోన్లను కనిపెట్టి బాధితులకు అందజేయడం జరిగిందని అన్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో అధికంగా మొబైల్ ఫోన్లను కనిపెట్టి బాధితులకు తిరిగి అందజేసే విదంగా కృషి చేసిన కానిస్టేబుల్ ఆఫీసర్ విష్ణువర్ధన్ ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ బి ఇన్స్పెక్టర్ నాగరాజు,ఐటి సెల్ ఇంచార్జి సీఐ నాగరాజు రెడ్డి మరియు ఐటి సెల్ సభ్యులు విజయ్,రాజేష్ పాల్గొన్నారు.

# ఆదివాసీ అభ్యర్థిని గెలిపించుకుందాం.. మన ఐక్యతను చాటుదాం...

**- తుడుందెబ్బ నేతల పిలుపు**

**గుండాల, మార్చి 30, ప్రజాజ్యోతి**



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ నియో జకవర్గం నుండి ఆదివాసి అభ్యర్థిని ఉమ్మడిగా ఎన్నికల బరిలో నిలిపి గెలిపించుకొని ఆదివాసుల ఐక్యతను వెలుగెత్తి చాటాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి జాతీయ కన్వీనర్ రమణా లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్ పిలుపునిచ్చారు. శనివారం గుండాల మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలైన టిఆర్ ఎస్, కాంగ్రెస్, బిజెపిలు బంజారా సామాజిక వర్గానికి పార్లమెంట్ టికెట్ ఇచ్చి ఆదివాసులకు ద్రోహం చేశారని ఆరోపించారు. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఆదివాసి ఓటు బ్యాంకు ఎక్కువ ఉన్నందున రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఉమ్మడి ఆదివాసి అభ్యర్థి నీ పోటీ చేయించి గెలిపించుకోవాల్సిన బాధ్యత యావత్ ఆదివాసులపై ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మన హక్కులతో పాటు చట్టాల పరిరక్షణకు ఆదివాసి ప్రజా ప్రతినిధులు గెలిచిననుడే హక్కులు పరిరక్షించ బడతాయన్నా రు. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుండి భద్రా చలం వరకు అధికార కాంగ్రెస్ పార్టీకి ఆదివాసీలే బలం చేకూ ర్చాలని అన్నారు. పార్లమెంటు ఎన్ని కల్లో కూడా కాంగ్రెస్ పార్టీ పునరాలోచించి ఆదివాసులకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతం లోని ఏజెన్సీ చట్టాలు పరిరక్షించు కోవాలని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత కూడా ఆదివాసు లకు ఉంద న్నారు. ఆదివాసులు ఏ రాజకీయ పార్టీలో ఉన్నా ఏ జండా మోసిన అంతిమంగా పార్లమెంటు ఎన్నికల్లో ఆదివాసి అభ్యర్థిని గెలిపించుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుంపిడి వెంకటేశ్వర్లు, పూణెం బాలకృష్ణ, వట్టం కన్నయ్య, పరస శ్రీనివాస్, తంగేళ్ల భద్రయ్య, వజ్జా ఎర్రయ్య, మోకాళ్ళ కన్నయ్య, దుగ్గరాశి వీరభద్రం, గోవింద నరసింహారావు, చింత వెంకటేశ్వర్లు, ఇమ్మిడి నాగేశ్వరరావు, పాల్వంచ వెంకటేశ్వర్లు, కుంజ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# బిక్కంటి ఛారిటబుల్ ట్రస్టుకు నోటీసులు జారీ

**భద్రాచలం టౌన్, మార్చి 30, ప్రజాజ్యోతి:**

భద్రాద్రి నృత్యాభిషేకము, సర్వాభిషేకము కార్యక్రమాన్ని గత సంవత్సరం విధంగానే దేవస్థాన వైకుంఠ ద్వారం వద్ద బిక్కంటి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవస్థానం నియమ నిబంధనలను పాటిస్తూ ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఏప్రిల్ 15వ తేదీన కార్యక్రమాన్ని నిర్వహించవ లసిందిగా దేవస్థాన కార్యనిర్వాహక అధికారి సూచించారు. దేవస్థానం వారి సూచనలు పాటించక వారి కార్యక్రమమును దేవస్థాన కళ్యాణ మండపంలో దేవస్థానం పేరుని ఉపయోగించి ఇన్విటేషన్ కార్డులు తయారుచేసి సోషల్ మీడియా నందు దేవస్థానం కీర్తి ప్రతిష్టలకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తించారు. అందుకు సదురు సంస్థ వారికి దేవస్థానప్రదేశమునందు కార్యక్రమమున నిర్వహించుటకు ఇచ్చిన అనుమతిని రద్దు పరిచినట్లు తెలిపారు. ఈ విషయంలో బిక్కంటి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్ వారికి నోటీసు జారీ చేసినట్లు ప్రకటనలో తెలిపారు.

# కరెంట్ షాక్ తగిలి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



**బూర్గంపహాడ్ మార్చి 30 ప్రజాజ్యోతి**

మండల పరిధిలోని నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో కరెంట్ షాక్ తగిలి చనిపోయిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి కుమారుడు చెంచలపు శ్రీకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం శనివారం మధ్యాహ్నం 1:00 సమయంలో తన ఇంట్లో తన తండ్రి చంచలపు వెంకటేశ్వర్లు(48) కరెంట్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స నిమిత్తం దగ్గరలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనపై ఎవరిపై అనుమానం లేదని ప్రమాదవశాత్తు జరిగిందని తెలిపారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు పోలీసులు మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# అత్యధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలి: ఐఎఫ్టీయు




**మణుగూరు మార్చి 30, ప్రజాజ్యోతి**

వేసవి అత్యధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో పారిశు ద్ధ్యం, సులబ్ కర్మచారి, రోడ్స్ క్లీనింగ్, ఉద్యానవనాలు, నర్సరీలు తదితర మండుటెండలో పనిచేసే సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టి యు మణుగూరు ఏరియా అధ్యక్షులు ఏ మంగీలాల్ సింగరేణి యాజమాన్యాన్ని కోరారు, శనివారం సాయంత్రం పీవీ కాలనీ మల్లారం రామాలయం అడ్డా పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు, ఎండల తీవ్రత నేపథ్యంలో ఎండలో పని చేయాలంటే కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, వారి ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం వరకు పనివేళలా మార్పుకు ఏరియా యాజమాన్యం తగు చర్యలు చేపట్టాలని కోరారు, అలాగే పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు, ప్రైవేటు వాహన డ్రైవర్లకు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లకు ,కోల్ ట్రాన్స్ పోర్ట్ టిప్పర్ డ్రైవర్లకు, ఓబి వర్కర్లకు ఓ ఆర్ ఎస్ మరియు మజ్జిగ ప్యాకెట్లు సకాలంలో అందజేయాలని కోరారు, ఓ బి కంపెనీలలో దుమ్ము ధూళి నివారణతో పాటు గనిలో చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలని కోరారు, అత్యవసర సేవలకై ఆయా గనులు డిపార్ట్మెంట్ ల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయటంతో పాటు వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కాంట్రాక్ట్ వర్కర్లకు సింగరేణి వైద్యులతో అవగాహన కల్పించాలని కోరారు,
ఈ కార్యక్రమంలో కారం భీమయ్య, మంగయ్య, రంగయ్య, నాగరాజు, ఉప్పయ్య, శ్రీరాములు, శీను, రాంబాబు, లక్ష్మీ, కృష్ణమ్మ,మునెమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ బూత్ లను పరిశీలించిన డీఎస్పీ

**ఇల్లందు, మార్చి 30, ప్రజాజ్యోతి:**

త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఇల్లందు మండలంలోని పలు పోలింగ్ బూత్ లను ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్ర భాను పరిశీలించారు. పోలింగ్ బూత్ లలో విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల వసతి ఉన్నాయా అని పరిశీలించారు. ఓటింగ్ లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సీఐ టి. కరుణాకర్, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.